


*(గత సంచిక తరువాయి)*

"**లట! ససేమిరా** అందుకు నేను ఒప్పుకోను. అధర్మం వాడిది కాని, నాదికాదు. బయట కూర్చునే బదులు జైల్లో కూర్చుంటాను. నేనేమైనా ప్రభుత్వోద్యోగినా ఉద్యోగం పోతుందని భయపడడానికి? లేదా పెళ్ళికాని ఆడపిల్లలున్న తండ్రినా, పిల్లలకి పెళ్ళికాదు అని భయపడడానికి?" కురంగేశ్వర్ తీవ్రంగా చెప్పాడు.

కురంగేశ్వర్‌ని ఆ కేసులోంచి ఎలా బయట పడెయ్యాలా అని త్రివిక్రం ఆలోచిస్తున్నాడు. వెంటనే అతనికి కానిస్టేబుల్ నాయక్ గుర్తొచ్చాడు. గాంధీ హాస్పిటల్‌లోని పోలీస్ పోస్ట్‌లో పనిచేసే నాయక్‌ది క్రిమినల్ కేసుల్లో గట్టి బుర్ర అని ప్రతీతి.

వెంటనే అతను డాక్టర్ విరజకి ఫోన్ చేసి నాయక్ సెల్ నెంబర్ కనుక్కుని తనకి ఫోన్ చేయమని, అతనితో పని పడిందని చెప్పాడు. ఆమె వివరాలు అడిగితే తర్వాత చెప్తానని చెప్పాడు. పావుగంట తర్వాత విరజ నించి ఫోన్ వచ్చింది. నాయక్ నెంబర్ చెప్పగానే రాసుకున్నాడు. ఆమెకి థాంక్స్ చెప్పి, ఆ నెంబర్‌కి ఫోన్ చేసాడు.

"హలో త్రివిక్రంగారూ?" నాయక్ అవతలనించి అడిగాడు.

"అవును."

"ప్రాబ్లం ఏమిటి సార్?"

కురంగేశ్వర్ కేస్ గురించి వివరంగా చెప్పాడు త్రివిక్రం.

"ఆయన దీన్నించి బయటపడడానికి మీరు ఏదైనా సలహా ఇవ్వగలరా అని అడగడానికి ఫోన్ చేసాను. పెద్దాయన్ని అనవసరంగా కేసులో ఇరికించారు."

"ఇంట్లో పనిచెయ్యడానికి వచ్చినప్పుడు బీరువాలోని బంగారు నగలు ఎత్తుకెళ్ళాడని వెంటనే జానయ్యమీద కూడా కేసు నమోదు చేయించండి. ఈ కేసు విత్‌డ్రా చేస్తే, దాన్నీ విత్‌డ్రా చేస్తామని బేరం పెట్టండి. ఓసారి ఒకరికి ఇలాగే జరిగితే ఇదే పనిచేసి ఆ కేసులోంచి తప్పించాను" నాయక్ తడుముకోకుండా చెప్పాడు.

"థాంక్స్. మంచి ఐడియా ఇచ్చారు. నేను గుంటూరు జిల్లాలో ఉన్నాను. తిరిగి వచ్చాక కలుస్తాను."

కురంగేశ్వర్‌కి ఆ ఐడియా గురించి చెప్పాడు త్రివిక్రం. వెంటనే అందరి మొహాల్లోకి వెలుగు ప్రవేశించింది.

"ఇదేదో బావున్నట్లుంది" వెంటనే చెప్పాడు కూర్మరాజు.

"ఇందాక చెక్ గురించి ఏదో చెప్తున్నారు? చెక్ జానయ్య పేర రాసిచ్చారా?" కొద్ది క్షణాలు ఆలోచించి అడిగాడు త్రివిక్రం.

"లేదు. సెల్ఫ్ చెక్. గొంతుమీద కూర్చుంటే, బేంక్‌కి వెళ్ళి కేష్ డ్రా చేసే టైం లేక సెల్ఫ్ చెక్ రాసిచ్చాను" కురంగేశ్వర్ వెంటనే చెప్పాడు.

"సెల్ఫ్ చెక్ అంటే వాడి పేరు చెక్‌లో ఎక్కడా ఉండదుగా?"

"ఉండదు. డ్రా చేసినపుడు దాని వెనక అతని సంతకం మాత్రం ఉంటుంది."

"మరీ మంచిది. మీ చెక్ బుక్ ఇంట్లోంచి దొంగిలించబడిందని, అందులో కొన్నిటిమీద సంతకాలు ఉన్నాయని ఫిర్యాదు చేయండి. మీరు బ్యాంక్‌కి వెళ్ళి ఎంక్వైరీ చేస్తే అందులోని చెక్‌ని ఎవరో ఉపయోగించి క్యాష్ విత్‌డ్రా చేసారని కూడా అందులో రాయండి. పోలీసుల ఎంక్వయిరీలో అది జానయ్య పని అని తేలినట్లుగా వాడి మీద కేసు నమోదు చేస్తారు. ఒకవేళ ఇది నిజంగా కోర్టుకి వెళితే రేపు మేజిస్ట్రేట్ ఆ కేసుని తప్పుడు కేసుగా అనుమానించే అవకాశం ఉండదు." త్రివిక్రం సూచించాడు.

"ఇదింకా బావుంది" బ్రహ్మేశ్వర్ చెప్పాడు.

వాళ్ళు కేసు గురించి చర్చించుకుంటుండగా సి.ఐ వచ్చాడు. తమ ఆలోచనని కూర్మరాజు సి.ఐకి చెప్పాడు.

ఆయన మొహం కూడా వికసించింది.

"ఎవరి ఆలోచన ఇది?" అడిగాడు.

"మీ డిపార్ట్‌మెంట్ మనిషిదే. నాయక్ అని హైదరాబాద్‌లోని ఓ కానిస్టేబుల్‌ది."

"ఇది బావుంది. ముల్లుని ముల్లుతోనే తీయాలని సామెత. ఏమంటారు?" సి.ఐ కురంగేశ్వర్‌ని అడిగాడు.

అంగీకారంగా తల ఊపాడాయన. ఐదు నిమిషాల్లో సి.ఐ కురంగేశ్వర్‌ని సెల్‌లోకి పంపించాడు. ఇద్దరు కానిస్టేబుల్స్ స్టేట్ బేంక్ ఆఫ్ ఇండియాకి ఎంక్వయిరీకి పంపాడు. ఇంకో ఇద్దరు వెళ్ళి జానయ్యని తీసుకొచ్చి, వాడిని సి.ఐ ముందు చేతులు కట్టుకుని నించోపెట్టారు. వాడు సి.ఐ వైపు నిర్లక్ష్యంగా చూసాడు తప్ప విష్ చేయలేదు.

"నువ్వు ఇవాళ ఉదయం స్టేట్ బేంక్ ఆఫ్ ఇండియాకి వెళ్ళి ఓ చెక్‌ని మార్చి మూడువేల రెండు వందల రూపాయలు క్యాష్ తీసుకున్నావా?" సి.ఐ అడిగాడు.

"తీసుకున్నాను" జానయ్య నిర్భయంగా జవాబు చెప్పాడు.

"ఆ చెక్ ఎక్కడిది నీకు?"

"కురంగేశ్వర్ ఇచ్చాడు."

"ఆయన ఇవ్వలేదుట. ఆయన చెక్ బుక్ ఇంట్లోంచి ఎవరో దొంగిలించారని నాకు ఫిర్యాదు అందింది. ఆ సెల్ఫ్ చెక్ నీ చేతికెలా వచ్చిందో నిజం చెప్పు." అడిగాడు సి.ఐ గట్టిగా.

"నిజంగా ఆయనే దాన్ని నాకు నేను చేసిన పనికి ఇచ్చాడండి."

"సరే. అది మేజిస్ట్రేట్ తేలుస్తాడు. నాకు ఫిర్యాదు అందింది. నీమీద కేసు పెట్టాను."

వెంటనే వాడిని తీసుకెళ్ళి సెల్ లోపల ఉంచారు. కురంగేశ్వర్ అతన్ని చూసి మొహం తిప్పుకున్నాడు. జానయ్య తన సెల్ ఫోన్‌నించి ఇంటికి ఫోన్ చేసి జరిగింది చెప్పాడు.

కొద్దిసేపటికి జానయ్య భార్య కొంతమంది బంధువులతో కలిసి పోలీస్ స్టేషన్‌కి వచ్చింది. వారి ముందు కావాలని కురంగేశ్వర్‌ని, జానయ్యని జీప్‌లో ఎక్కించుకుంటూ ఎస్.ఐ చెప్పాడు.

"ఈయన ఇతన్ని కులం పేరుతో తిట్టి కొట్టాడు. ఇతను ఈయన చెక్‌బుక్‌ని దొంగిలించాడు. మేజిస్ట్రేట్ దగ్గరకి తీసుకెళ్తున్నాం. ఇంకో రెండేళ్ళ దాకా ఇద్దరూ బయటికి రారు. బేంకులోని జానయ్య సంతకం గల చెక్ సాక్ష్యం చాలు."

"వద్దు సార్. ఆయనతో మాకేం పేచీలేదు. మేము మా కేసుని వెనక్కి తీసేసుకుంటాం. ఆయన్నీ తీసుకోమనండి" జానయ్య భార్య జీపుకి అడ్డంగా నిలబడి చెప్పింది.

రాజీకి ప్రయత్నాలు ఆవిడ వైపునించి మొదలయ్యాయి. గంట తర్వాత జానయ్య తనే తప్పుడు కేసు బనాయించానని, కురంగేశ్వర్ తనని కులం పేరుతో తిట్టలేదని రాసిచ్చాక, కురంగేశ్వర్ పోలీస్ స్టేషన్ నించి విడుదలై ఇంటికి చేరుకున్నాడు.

ఆదుర్దాగా ఉన్న ఆయన కోడలు వంట చేయలేదు. వారు తిరిగిరాగానే వంట ప్రయత్నం మొదలుపెట్టింది.

కురంగేశ్వర్ స్నానం చేసాక త్రివిక్రంని డాబామీదకి తీసుకెళ్ళాడు. ఇప్పుడాయన మొహం కాస్త తెరిపిగా ఉంది.

"సమయానికి దేవుడు పంపినట్లుగా వచ్చావు. నాతో ఏం పని బాబూ?" అడిగాడాయన.

త్రివిక్రం చెప్పేదంతా కురంగేశ్వర్ ఆశ్చర్యంగా వింటూండిపోయాడు. అతని తల్లి రోడ్డు ఏక్సిడెంట్‌లో మరణించడం దగ్గరనించి కురంగేశ్వర్ ఎడ్రస్‌ని తెలుసుకునేదాకా వివరించాడు త్రివిక్రం. అలెగ్జాండర్‌ని కర్నూలు హాస్పిటల్‌లో ఏ పరిస్థితిలో కలిసాడో చెప్పే సందర్భంలో వింటున్న కురంగేశ్వర్ కళ్ళు చెమర్చాయి. తర్వాత చెప్పాడు త్రివిక్రం.

"మీకు డి.ఎన్.ఏ టెస్ట్ చేస్తే మీరే నా తండ్రి అయితే ఆ సంగతి తెలుస్తుంది. అందుకని మీ దగ్గరికి వచ్చాను."

"అలాగే. అందుకు నేనేం చేయాలి?"

"మీరు ఓ చుక్క రక్తం ఇస్తే చాలు. దాని ఆధారంగా టెస్ట్ చేస్తాను."

"దాందేముంది? తీసుకో."

త్రివిక్రం తనతో తెచ్చిన ప్రత్యేక సిరంజితో ఆయన నరంనించి కొద్దిపాటి రక్తాన్ని తీసాడు. తర్వాత సిరంజిని తీసేస్తే అదే సీసాలా పనిచేసింది.

"థాంక్స్. రాత్రికి హైదరాబాద్ చేరుకుంటాను. రేపు ఈ పాటికి రిజల్ట్ తెలుస్తుంది."

"తెలియగానే నాకు మర్చిపోకుండా ఫోన్ చేసి చెప్పు."

"తప్పకుండా."

కొద్ది క్షణాల నిశ్శబ్ధం తర్వాత కురంగేశ్వర్ చెప్పాడు.

"ఆ రాత్రి జరిగినదానికి నేను ఎంత పశ్చాత్తాప పడ్డానో. నేర బుద్ధిలేకుండా, క్షణికావేశంలో నేరం చేసిన ప్రతీవారు తమ తప్పిదానికి తర్వాత పశ్చాత్తాప పడతారని, నేర ప్రవృత్తిగలవారు మాత్రం పశ్చాత్తాప పడరని నేను జైల్లో గ్రహించాను. కానీ హరినాథ్‌లో నాకు ఆ పశ్చాత్తాపం కనపడలేదు."

ఇద్దరి మధ్యా కాసేపు నిశ్శబ్దం.

"ఆ చిట్‌ఫండ్ కంపెనీలో మిమ్మల్ని ఉద్యోగంలోంచి ఫ్రాడ్ కేస్ వల్ల తీసేసారని చెప్పారు. దాని గురించి చెప్తారా?" అడిగాడు త్రివిక్రం.

కురంగేశ్వర్‌లో నిజంగా నేరప్రవృత్తి ఉందో లేదో తెలుసుకోవాలనుకుని అతను ఆ ప్రశ్నని వేసాడు.

"ఆ ఫ్రాడ్‌కి, నాకు ఎలాంటి సంబంధంలేదు. అది తెలిసి కూడా హరినాథ్ నన్ను ఉద్యోగంలోంచి తీసెయ్యడానికి కారణం ఆయన తండ్రే రఘునాథ్ తండ్రి పోలీస్ శాఖలో పనిచేసాడు కాబట్టి అందర్నీ అనుమానించే సైకాలజీ. ఆయన తీసేయమని చెపితే హరినాథ్ విధి లేక నన్ను తీసేసాడు. ఆ ఫ్రాడ్ ఎలా జరిగిందో చెప్తా విను."

త్రివిక్రం కురంగేశ్వర్ చెప్పేది శ్రద్ధగా వినసాగాడు.

"ఓ తెలివైన వ్యక్తి తెలివిని పాజిటివ్‌గా ఉపయోగిస్తే ఓ టెలిఫోన్ లేదా ఓ రైలింజన్ పుడుతుంది. ఓ చక్కటి కథ లేదా చిత్రం ఆవిర్భవిస్తాయి. ఓ కొత్త వ్యాపారం లేదా ఓ కొత్త సౌకర్యం కనిపెట్టబడతాయి. తెలివైన మనిషి నెగెటివ్‌గా ఉపయోగిస్తే ఓ హత్య, ఓ

ఏటియం లూటీ, ఓ వ్యక్తిని బోల్తా కొట్టించి డబ్బు సంపాదించడంలాంటివి జరుగుతాయి. మా చిట్‌ఫండ్ కంపెనీలో ముదుపు చేసిన తిప్పయ్య అనే కస్టమర్‌కి అమోఘమైన తెలివితేటలు ఉన్నాయి. దాన్ని అతను నెగెటివ్‌గా ధనార్జనకి వినియోగించాడు."

కురుంగేశ్వర్ చెప్పేది త్రివిక్రం శ్రద్ధగా వినసాగాడు.

"అతను అప్పటికే రెండు విడతలుగా కంపెనీలో రెండుసార్లు చిట్స్ తీసుకుని సక్రమంగా చెల్లించాడు. మూడోసారి చిట్‌ని తన పేరకాక, తనకూతురు జ్ఞానవతి పేర తీసుకున్నాడు. ఓపెనింగ్ ఫారాలన్నిటిమీదా ఆమే సంతకాలు చేసింది. చెక్ మీద సంతకం చేసి ఇచ్చింది. రెండు నెలల తర్వాత ఆమె చిట్టీని పాడి డబ్బు తీసుకుంది. ఆ తర్వాత డబ్బు చెల్లించడం మానేసింది. నిజానికి జ్ఞానవతి అమాయకురాలు. ఆమె తండ్రే సూత్రధారి. మా కంపెనీ నోటీసు ఇస్తే, ఆమె తరఫు లాయర్ ఆమె మైనర్ అని, ఆమెకి ఎలాంటి బాధ్యత లేదని జవాబు ఇచ్చాడు.

ఆమె మైనర్ గర్ల్ అని నాకు తెలియదు. మేజర్ అని అనుకున్నాను. ఆమె పేర చిట్ తీసుకున్నప్పుడు ఆమె మేజర్ కాదు. ఇంకో ఏడునెలలదాకా మైనరే. ఆ నోటీస్ వచ్చాక మా వాళ్ళు ఆమె సంతకం చేసిన ఫారం తీసి చూస్తే ఆమె డేటాఫ్ బర్త్‌లో సంవత్సరం 1988 అని ఉంది. నిజానికి ఆమె పుట్టింది 1989. కస్టమర్ తరఫున ఏజంటే అప్లికేషన్ ఫిలప్ చేసి సంతకం తీసుకుంటాడు. అందులోని సమాచారం మొత్తం అడిగి నింపుతాడు. నేను కూడా అలాగే చేసాను."

"మీరు డేటాఫ్ బర్త్ సర్టిఫికెట్‌ని చెక్ చేయలేదా?" అడిగాడూ త్రివిక్రం.

"లేదు వారు చెప్పింది సరైనది అని నమ్మి ముందుకి వెళ్తూంటాం. మైనర్ ఐతే అసలు చిట్ ఓపెన్ చేయం. ఫలితంగా మా కంపెనీ ఆమెమీద దావా వేయలేకపోయింది. ఆ సొమ్ము పోయింది. గేరంటీ విషయంలో కూడా జ్ఞానవతి తండ్రి మోసం చేసాడు. పార్టీనించి రికవరీ కాకపోతే అప్పుడు హామీ ఉన్నవారినించి రికవరీ చేస్తాం. కానీ హామీ ఉన్న ఆ ప్రభుత్వోద్యోగి అప్పటికే ఇంకో ఇద్దరికి కూడా  హామీ ఉన్నాడు. ఆ హామీ ప్రకారం అప్పటికే ఆయన జీతం నించి వేరే చిట్‌ఫండ్ కంపెనీ రికవరీ చేస్తోంది. ఓ ప్రభుత్వోద్యోగి టేక్ హోం పే కనీసం ఇంత ఉండాలనే నియమం ఉంది. మొత్తం అప్పులవాళ్ళు రికవరీ చేస్తే అతను బ్రతికేది ఎలా? ఈ నియమం ప్రకారం అతనిమీద దావా గెలిచినా రికవరీ మాత్రం జరగలేదు. ఈలోగా అతను రిటైరైపోయాడు. అతని పెన్షన్‌ని మేం తాకలేం. తిప్పయ్య తను కరెక్ట్ డేటాఫ్ బర్త్ చెపితే నేనే తప్పుగా రాసుకున్నానని, మైనర్ పేరు మీద చిట్ తీసుకోకూడదని తనకి తెలీదని అతని వాదన. ఆ తర్వాత ఎవరు చిట్టీ పాడి తీసుకున్నా వారి డేటాఫ్ బర్త్ సర్టిఫికెట్ కాపీ, ఫలానా చిరునామాలో ఉంటున్నారనే ధృవపత్రం తీసుకోవటం మొదలుపెట్టి వాళ్ళు అలాంటి మోసం చేయకుండా అన్ని చిట్‌ఫండ్ కంపెనీలు జాగ్రత్తపడ్డాయి. ఇప్పుడు అన్ని చిట్ కంపెనీలూ ఆ నిబంధనలు పాటిస్తున్నాయి. రకరకాల మోసాలు జరిగాక పాఠం నేర్చుకున్న చిట్‌ఫండ్ కంపెనీలు తన నిబంధనలని టైట్ చేస్తూ వస్తున్నాయి. ఐనా అరుదుగా అప్పుడప్పుడూ అవి మోసపోతూనే ఉన్నాయి."

కురంగేశ్వర్ మోసగాడు కాడు అనుకున్నాడు త్రివిక్రం.

"ఓసారి బలాత్కారం కేసులో జైలుకి వెళ్ళి వచ్చాను. అవనీతి ఆరోపణలతో ఉద్యోగంలోంచి తీసివేయబడ్డాను. ఇక నన్ను నమ్మి నాకు ఎవరు ఉద్యోగం ఇస్తారు? నా దస్తూరి బాగుంటుంది. చిట్‌ఫండ్ కంపెనీలో అకౌంట్స్ రాసే విద్య పట్టుబడింది. దాంతో హరినాథ్ నన్ను ఓ సేల్స్ ప్రాక్టీషనర్‌కి పరిచయం చేసాడు. చిన్న చిన్న వ్యాపారస్థులకి అకౌంట్స్ రాసే పని ఆయన నాకు అప్పగించాడు."

"మీరు సికింద్రాబాద్‌లో సైనిక్‌పురిలో కొంతకాలం ఉన్నారా?"

"అవును. మా అబ్బాయి బ్రహ్మేశ్వర్ ఆర్మీలో చేరాక అక్కడ ఉన్నాం. ఇక్కడ ఇల్లు కొన్నాక ఇక్కడికే వచ్చి ఉంటున్నాం. మావాడు సెలవలకి ఇంటికి వచ్చాడు."

"ఓ"

"ఈ జిల్లాకి, మాకు ఎలాంటి సంబంధం లేదు. ఐనా ఇక్కడ బావాజీ పాలెంలోనే వాడు ఇల్లు ఎందుకు కొన్నాడో తెలుసా?" నవ్వుతూ అడిగాడు కురంగేశ్వర్. "తెలీదు. ఏమిటి ఈ ఊరు ప్రత్యేకత?"

"ఈ గ్రామంలో మొత్తం మూడొందలదాకా ఇళ్ళున్నాయి. దాదాపు ప్రతీ ఇంటినించి ఓ సైనికుడు ఉన్నాడు. కొన్ని ఇళ్ళల్లో ఇద్దరు, ముగ్గురు కూడా ఉన్నారు. ఈ ఊరునుంచి మొత్తం అయిదు వందల మంది భారత సైన్యంలో పనిచేస్తున్నారు. ఈ ఊరివారు అనేక దశాబ్దాలుగా సైన్యంలో చేరడానికి ఇష్టపడుతున్నారు. నేటికీ ఉద్యోగం అనగానే, ఇక్కడి యువకులు సైన్యంలో ఉద్యోగం సంపాదించాలనే చూస్తుంటారు."

"ఇది గొప్ప విషయం" మెచ్చుకున్నాడు త్రివిక్రం.

"సైన్యంలో ఉద్యోగం చేస్తూండబట్టి మా అబ్బాయికి ఈ విషయం తెలిసింది. అందుకని కావాలని బావాజీపాలెంలోనే ఇల్లు కట్టించుకున్నాడు."

"ఈ ఊళ్ళో ఎంతకాలంనుంచీ ఇలా సాగుతోంది?"

"మొదటి ప్రపంచయుద్ధ కాలంలో అంటే నైన్‌టీన్ ట్వంటీస్‌లో ఉపాధి కోసం ఇక్కడనించి కొందరు సైన్యంలో చేరారు. రెండో ప్రపంచ యుద్ధకాలం నాటికి, అంటే నైన్‌టీన్ ఫార్టీస్‌కల్లా బావాజీపాలెం నించి సైన్యంలో చేరే వారి సంఖ్య బాగా పెరిగింది. వారి మార్గాన్నే చాలామంది అనుసరించారు. నైన్‌టీన్ ఎయిటీ వన్ కల్లా దాదాపు ప్రతీ ఇంటినించి ఒక సైనికుడు ఉన్నాడు. దాంతో ఇండియన్ ఆర్మీ ఈ ఊరిని అభివృద్ధి చేయడానికి పదకొండు లక్షల రూపాయలు ఖర్చు చేసి తాగునీటి సౌకర్యం, ఇతర సౌకర్యాలను కల్పించింది."

"ఇంజనీరింగ్, సాఫ్ట్‌వేర్ వైపు పరిగెత్తే ఆ రోజుల్లో ఇక్కడి యువకులని మెచ్చుకోవాల్సిందే" మెచ్చుకున్నాడు త్రివిక్రం.

"మా పెద్ద కొడుకు శ్రీనగర్‌లో, రెండోవాడు పటేలాలో, మూడోవాడు గోవాలో ఉన్నారు అని చెప్తుంది మా పక్కింటావిడ. మా ఎదురింటావిడ కొడుకు బెంగుళూరులో బేరక్స్‌లో ఉన్నాడు. బంధువులందరి కుటుంబాలు తీసుకుంటే ఓ కుటుంబంలో నలభై అయిదుమంది సైనికులు ఉన్నారని మొన్న ఎవరో చెప్తున్నారు. భారత్ చైనా, భారత్ పాక్ యుద్ధాలలో పాల్గొన్నవారు ఈ ఊరిలో రిటైర్డ్ జీవితాలని గడుపుతున్నారు. దాదాపు నాలుగు వందల మంది రిటైరయినవారు ఇక్కడ ఉన్నారు."

"అయితే ప్రతీ ఇంట్లో మిలటరీ యూనిఫాంలో, తుపాకీని ధరించిన సైనికుల ఫోటోలు ఉంటాయన్నమాట."

"అవును. మన రాష్ట్రంలో సైనికులు అధికంగా ఉన్న గ్రామం ఇది. మొదటి ప్రపంచ యుద్ధాలలో, 1962 ఇండో - చైనా యుద్ధంలో, 1965 ఇండో పాకిస్థాన్ యుద్ధంలో, 1971 బంగ్లాదేశ్ విమోచన యుద్ధంలో ఈ గ్రామం నించి వెళ్ళిన సైనికులు పాల్గొన్నారు. ఇలాంటిదే ఇంకోటి పశ్చిమ గోదావరి జిల్లాలోని మాధవరం. మిల్రటీ మాధవరం అంటారు దాన్ని. అక్కడ కూడా ప్రతీ కుటుంబం నించి సైనికులు ఉన్నారు. ఏటా ఏభై మంది సైన్యంలో చేరుతున్నారు అని విన్నాను."

'గ్రేట్..!"

ఇద్దరూ కిందికి దిగి వచ్చారు.

"అన్నం వడ్డించనా మామయ్యా?" అడిగింది కోడలు.

"నీదే ఆలస్యం" నవ్వుతూ చెప్పాడు ఆయన.

భోజనాలు అయాక ఆమె ఇంటి కిటికీ గ్రిల్స్‌ని, అద్దాలని చేతికి తొడుక్కున్న పాత సాక్స్‌తో తుడవడం చూసి త్రివిక్రం నవ్వుతూ చెప్పాడు.

"గుడ్ ఐడియా. మీరు తెలివైనవాళ్ళు."

"సైన్యంలో పనిచేసేవారికి సాక్స్ వాడకం ఎక్కువ. మా వారు ఇంటికి వచ్చినప్పుడల్లా పాతవి తెచ్చిపడేస్తుంటారు. వాటిని పారేయకుండా అనేక రకాలుగా ఉపయోగిస్తుంటాను. టి.వి స్క్రీన్, ఫ్రిజ్, కంప్యూటర్ మోనిటర్‌లాంటి సున్నితమైన సర్ఫేసెస్‌ని తుడవడానికి సాక్స్‌నే వాడతాను. వీటిని స్టోరేజ్ కోసం కూడా వాడతాను" నవ్వుతూ చెప్పిందామె.

"స్టోరేజ్ కోసమా?"

"అవును. నట్లూ, బోల్టులూ, మేకులూ లాంటివి వీటిలో పోసి అలమారలో కొట్టిన మేకుకి వేలాడదీస్తాను. అవసరానికి వాటికోసం ఇల్లంతా వెదకక్కర్లేదు. చీరలకి వర్క్ చేసే ఊలుదారాలు, పూసలు, చెమ్కీలులాంటివి సాక్సులో పోసి దగ్గర ఉంచుకుంటే వాటి కోసం డ్రాయర్లన్నీ వెతుక్కోనక్కరలేదు. పిల్లల ఆట సామాను ఖాళీ సాక్సుల్లో పోసి మూతికి తాడు కట్టి దాస్తాను. కోకోకోలా టిన్స్‌ని పాదభాగం దాకా కత్తిరించిన సాక్స్‌లో దింపి వాటి మీద పెయింటింగ్ వేసి, పూసలు కుట్టి, ఫ్లవర్ వేజ్‌గా చేసి, అందులో నీటిని పోసి తాజా పువ్వులని ఉంచుతుంటాను. ఇంకా సాక్స్ మూతికి నాణెం పట్టేంత ఖాళీ ఉంచి కుట్టి పిల్లలకి ఇస్తే అది కిడ్డీ బ్యాంకు అవుతుంది."

"చాలా ఆసక్తిగా ఉంది మీరు చెప్పింది."

"అందరి ఇళ్ళల్లో సైనికు ఎక్కువ కాబట్టి ఇంకా ఎన్నో రకాలుగా మా గ్రామస్థులు సాక్స్‌ని ఉపయోగిస్తారు."

"ఇందాక మీరు చెప్పింది గుర్తొస్తోంది. తెలివిని పాజిటివ్ దారిలో ఉపయోగించుకోవడం అంటే ఇదే" త్రివిక్రం కురంగేశ్వర్‌తో చెప్పాడు.

గంట తర్వాత టీ తాగి వీడ్కోలు తీసుకున్నాడు త్రివిక్రం. వద్దంటున్నా వినకుండా కురంగేశ్వర్ మెయిన్ రోడ్ మీదకి వచ్చి నిజాం పట్నం వెళ్ళే పాసింజర్ బస్సుని ఎక్కించాడు. బస్ కదలబోయే ముందు అడిగాడు త్రివిక్రం.

"హరినాథ్ ప్రస్తుతం అమెరికాలో ఉన్నారు. ఒకవేళ మీది ఆయనది డి.ఎన్.ఏలో మేచ్ కాకపోతే నవనీత్‌ని కలవాల్సి ఉంటుంది. ఆయన ఎక్కడ ఉన్నారో మీకు తెలుసా?"

"సారీ. తెలీదు. హరినాథ్‌కి కూడా తెలీదనుకుంటా. తెలిసినట్లు ఎప్పుడూ చెప్పలేదు. నవనీత్ మాతో టచ్‌లో లేడు."

నిజాం పట్నంలో దిగి తెనాలికి చేరుకున్నాడు త్రివిక్రం. అక్కడ నించి మళ్ళీ సికింద్రాబాద్ వెళ్ళే రైలు ఎక్కాడు.

ఆరోజు హాస్పిటల్‌కి త్రివిక్రం వెళ్ళాక, కురంగేశ్వర్ రక్తాన్ని ఇచ్చి లాబ్ టెక్నీషియన్‌కి చెప్పాడు.

"నాదీ, ఇదీ డి.ఎన్.ఏ మేచ్ అవుతుందేమో చూడండి."

"అలాగే సార్."

అది వ్యక్తిగత పనికనుక అతడికి పూర్వం ఇచ్చినంత డబ్బిచ్చి చెప్పాడు.

"తొందరలేదు."

"రేపు సాయంత్రంలోగా చేయడానికి ట్రై చేస్తాను. లేదా ఎల్లుండి మార్నింగ్ ఫస్ట్ అవర్‌లో చేస్తాను. లారీ ట్రాక్టర్ యాక్సిడెంట్‌కి గురైె పేషెంట్స్ చాలామంది అడ్మిట్ అయ్యారు సార్. దురదృష్టవశాత్తు రెండిటినిండా జనం ఉన్నారు. వారి బ్లడ్ గ్రూప్స్ అర్జెంటుగా మేచ్ చేసి ఇవ్వాలి" అతను చెప్పాడు.

"అరె పాపం. ముందు వాళ్ళ పని చూడు" చెప్పాడు త్రివిక్రం.

తన గదిలోకి వెళ్ళిపోయాడు. అక్కడ తనకోసం వేచి ఉన్న ఒకతన్ని చూసి గుర్తుపట్టాడు త్రివిక్రం. ఆ రోగి నవ్వుతూ తన బొటనవేలిని అటూ ఇటూ, ముందీ వెనక్కి ఆడించి చూపించాడు. కొద్దిరోజుల క్రితం అతను ఓ వింతవ్యాధితో వచ్చాడు. బేంక్‌లో

క్లర్క్‌గా పని చేసే అతని కుడిచేతి బొటన వేలు నిలబడకుండా పడిపోతూంటుంది. దాంతో పెన్ను పట్టుకుని రాయడం కష్టం అయింది. బేంక్‌లో సరిగ్గా పనిచేయలేకపోతున్నాడు. త్రివిక్రం అది నరాలకి సంబంధించిన వ్యాధిగా భావించి నరాల పటుత్వానికి కొన్ని ఇంజక్షన్లు, మందులు ఇచ్చాడు. మూడు రోజులైనా అతనిలో గుణం కనిపించలేదు. ఆ వ్యాధికి కారణం గురించి తోటి డాక్టర్లతో చర్చించి అనేక పరీక్షలు జరిపించాడు. కానీ అసలు కారణం ఎవరికీ బోధపడలేదు. అన్ని పరిక్షల ఫలితాలు నార్మల్‌గానే ఉన్నాయి.

ఆ తర్వాత అతను త్రివిక్రం దగ్గరకి రావడం మానేసాడు. మళ్ళీ రావడం ఇదే. వెంటనే త్రివిక్రం అతని బొటనవేలి వంక చూసాడు. అది మామూలుగా నిలబడి ఉంది.

"ఏ మందు పని చేసింది?" ప్రశ్నించాడు త్రివిక్రం.

"మీరిచ్చిన ఏ మందూ పనిచేయలేదు సార్."

"యునాని మందు వాడతానన్నారుగా. అది పనిచేసిందా?"

"లేదు. హోమియోపతి కూడా ఫెయిలైంది."

"మరి ఎలా బాగైంది?"

"అది చెప్పడానికే వచ్చాను సార్. మీరు నమ్మరు కానీ ఆఖరి ప్రయత్నంగా చిత్రాడకి వెళ్ళాను."

"చిత్రాడ? అదెక్కడుంది?"

"తూగోజిలో. కాకినాడ బ్రాంచిలో పనిచేసే ఓ కొలీగ్‌కి నాకు వచ్చిన ఆ జబ్బు గురించి, అది నయం కాకపోవడం గురించి తెలిసి తన దగ్గరకి రమ్మని ఫోన్ చేస్తే వెళ్ళాను. కాకినాడ నించి పిఠాపురం వెళ్ళేదారిలో చిత్రాడ అనే చిన్న ఊరుంది. అక్కడ ఉన్న ఓ ఆయుర్వేద వైద్యుడి దగ్గరకి అతను నన్ను తీసుకువెళ్ళాడు. ఆయన ఎలాంటి రోగానికైనా చికిత్స చేస్తాడట. పిఠాపురం మహారాజ్ వారి కుటుంబానికి ఆయనే చికిత్స చేసేవాడుట. నా వేలుని పరీక్షించి సాయంత్రం రమ్మన్నాడు. కళ్ళకి గంతలు కట్టి రోజు నా వేలుమీద ఏదో వెచ్చటి ద్రవాన్ని పోసి చికిత్స చేసాడు. మూడురోజుల్లో వేలు నయం అయింది."

"ఆయుర్వేదంలో కూడా మంచి మందులు ఉన్నాయి. కళ్ళకి గంతలు కట్టడం దేనికి?"

"పావురం రక్తంతో ఆ చికిత్స జరిగింది. అది తెలిస్తే పావురం మీద దయ చూపించి ఇక రానని భయపడ్డాడు. ఆయన దగ్గర వైద్యం చేయించుకోవడానికి దేశం నలుమూలలనించి వింత రోగులు వస్తుంటారట. డబ్బు మనం ఇచ్చింది తీసుకోవడం తప్ప, ఇంతని డిమాండ్ చేయడు."

"మహానుభావులు అనేకులు మనదేశంలో ఉన్నారు. కానీ వారిగుంచి అందరికీ తెలీదు" చెప్పాడు త్రివిక్రం.

"అది చెప్పడానికే వచ్చాను సార్. మీ దగ్గరకి వచ్చే మొండి రోగాలతో బాధపడే వారికి ఆయన ఫోన్ నంబర్, ఎడ్రస్ ఇవ్వండి. అది రాసుకోండి."

తన సెల్‌ఫోన్‌లోని నోట్స్‌లో ఆ ఊరిపేరూ, వెళ్ళేదారి, ఆ వైద్యుడి పేరు, ఫోన్ నంబర్లని త్రివిక్రం వెంటనే ఫీడ్ చేసుకున్నాడు.

"మీరు శ్రమ అనుకోక వచ్చి నాకు ఈ సమాచారం ఇచ్చినందుకు థాంక్స్. ఇది చాలామందికి ఉపయోగిస్తుంది." చెప్పాడు త్రివిక్రం.

సాయంత్రం త్రివిక్రం ఇంటికివెళ్ళబోతూ లేబ్‌కి వెళ్ళాడు. ఆ టెక్నీషియన్ నొచ్చుకుంటూ చెప్పాడు.

"సారీ సర్ పని తెమల్లేదింకా. రేపు ఉదయం మీరు వచ్చేసరికి రిపోర్టు సిద్ధం చేస్తాను. ఇంకొకతను ఇవాళ రాకపోవటంతో అతని పనంతాకూడా నామీదే పడింది."

"నో ప్రోబ్లం."

త్రివిక్రం ఇంటికి చేరుకున్నాడు. 'ఫలితం ఎలా ఉంటుందో?' అని అతను దారంతా ఆలోచిస్తూనే ఉన్నాడు. కురుంగేశ్వర్ తన తండ్రి అయితే బావుండునని కూడా అతనికి అనిపించింది. ఆయనలో ఓ విధమైన ఆకర్షణ శక్తి ఉందని, అది ఆయన నిజాయితీలోంచి వచ్చిందని అతనికి అనిపించింది.

ఆ రాత్రి త్రివిక్రం జి మెయిల్‌లోని మెయిల్స్ చదువుతూంటే, ఓ ఉత్తరంలో ఇలా ఉంది. జి మెయిల్‌లోని తెలుగులో టైప్ చేసే సౌకర్యంతో తెలుగులో టైప్ అయి ఉందా ఉత్తరం.

ఓ డాక్టర్ గారు!

మనిషి మరణించాక కూడా ప్రాణంతో ఉండే శరీరభాగాలు గురించి తెలుసుగా?

కళ్ళు - 31 నిమిషాలు

మెదడు - 10 నిమిషాలు

కాళ్ళు - 4 గంటలు

చర్మం - 5 రోజులు

గుండె - 10 నిముషాలు.

ఎముకలు - 30 రోజులు

స్నేహం - 7 జన్మలు

మీ స్నేహితులని మిస్ కాకండి.

-స్ఫూర్తి

వెంటనే రిప్లై బటన్‌ని క్లిక్ చేసి, ఇంగ్లీష్‌లో టైప్ చేసాడు.

నో పాయిజిన్ కెన్ కిల్ ఏ పాజిటివ్ థింకర్,

అండ్ నో మెడిసిన్ కెన్ క్యూర్ ఏ నెగిటివ్ థింకర్. జడ్జ్ హు ఏమ్ ఐ.

-టివి.

అతను దాన్ని పంపిన కొద్దిక్షణాలకి దానికి రిప్లయ్ వచ్చింది. దాన్ని తెరచి చదివాడు.

I HATE YOU

I HATE YOU

I HATE YOU

ఛాటింగ్‌లోకి వస్తే ఎందుకో చెప్తాను

- స్ఫూర్తి.

*(కొనసాగింపు వచ్చేనెలలో)*

Post your comments

ప్రస్తుతం అందుబాటులో ఉన్న మల్లాదిగారి పుస్తకాల వివరాల కోసం ఇక్కడ క్లిక్ చేయండి

www.anandbooks.com
www.telugubooks.in